# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 26 ఏప్రియల్ : 2024 విడుదల : 8

***"నా దేవా, నా దేవా***

***నన్నెందుకు చెయ్యి విడిచితివి"***

***–మత్తయి 27:46***

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

ఏప్రియల్ - 2024

**సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.150/-**


## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-6 |
| 2. | ఆపదలో దాగిన అవకాశం | 7 |
| 3. | నీ కొరకైన క్రీస్తు కేక | 8-13 |
| 4. | అంగడిలో అద్భుతము | 14-15 |
| 5. | క్రీస్తు కొరకు నిలబడుట | 16-19 |


## సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥ 9.00

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

# ఎడిటర్ అర్పణ

**మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు తెలియజేయుచున్నాను.**

**"ఇస్సాకు ఆ దేశమందున్నవాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలముపొందెను. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక ఆ మనుష్యుడు గొప్పవాడాయెను" ఆది. 26:12.**

దేవుడు నూరంతల ఆశీర్వాదం ఇస్సాకుకి ఇచ్చాడు. మనం ఒక పని ప్రారంభించినప్పుడు ఒక అడుగు ముందుకు వేసినప్పుడు అక్కడ నూరంతల ఆశీర్వాదం మనకు కనబడితే ఎంతో గొప్ప సంతోషం ఉంటుంది. ఎందుకని ఇస్సాకుకి దేవుడు నూరంతల ఆశీర్వాదం ఇచ్చాడు. మనం చేసేదానిలో దేవుని యొక్క ఆశీర్వాదపు హస్తాన్ని మనం చూడాలి. దేవుడు తన బిడ్డలను ఖచ్చితంగా ఆశీర్వదిస్తాడు. ఆ ఆశీర్వాదానికి తగిన మార్గములో మనం నడవాలి. ఎందుకని దేవుడు ఇస్సాకుని ఆశీర్వదించాడో మనం చూద్దాము.

**"సాయంకాలమున ఇస్సాకు పొలములో ధ్యానింప బయలువెళ్లి కన్నులెత్తి చూచినప్పుడు ఒంటెలు వచ్చుచుండెను" ఆది. 24:63.**

ఇస్సాకు పొలములో ధ్యానిస్తున్నాడు. దీనికి ముందు ఎవరూ కూడా పొలములో ధ్యానించలేదు. నీవు నూరంతల ఫలము చూడాలంటే ఒంటరి ప్రార్థనకి వెళ్ళాలి. దేవునితో గడపడానికి నీవు మనస్సు నిలిపినట్లైతే దేవుడు నీమీద మనస్సు పెడతాడు. దేవుని మాట సత్యం. భూమి మీద మనం చూసినప్పుడు నరుల మాటలు నిలువవు. ఈరోజు ఉన్న మాట రేపు ఉండదు కాని దేవుని వాక్యం అరక్షరం కూడా కొట్టివేయబడకుండా నెరవేరుతుంది. నీవు దేవుని దగ్గరకు వెళ్ళిన తరువాత నీ పనిని దేవుడు దీవెనకరంగా చేయకుండా ఉంటాడా? దేవునితో నీవు గడిపే సమయం మీద నీవు ఎంత మనస్సు పెట్టావు? నీతో పనిచేసే వారందరూ ప్రార్థనాపరులై యుండాలి. ప్రభువులో ప్రయాస ఏదీ వ్యర్థం కాదు. జాన్ నాక్స్ గారు స్కాట్లాండ్‌లో సువార్త ప్రకటిస్తుంటే ఎవరు వింటున్నారయ్యా నీ సువార్తను అన్నారు. ఆయన ఒక మాట చెప్పారు ఎవరూ వినకపోయినా ప్రార్థనను ఈ గాలిలో కలిపేస్తున్నాను అని చెప్పారు. ఇక్కడ ఉన్నవారు ఆ గాలిని పీల్చుకుంటారు

ఏదో ఒకరోజు రక్షించబడతారు అని చెప్పారు. ఎంత విశ్వాసముంటే ఆ మాట చెప్పారు. ఒక సేవకుడైనా కుటుంబ యజమాని అయినా వ్యాపారం చేసే వ్యక్తి అయినా దేవునితో గడపడానికి వెళ్ళిన తరువాత ఆ వ్యక్తి ఓడిపోడు. అపజయం రాదు. యెహోవా అతనిని ఆశీర్వదించాడు గనుక అతను గొప్పవాడాయెను. నూరంతల ఫలానికి ఆశీర్వాదానికి ముందు ఇస్సాకు పొలములో ధ్యానించడానికి వెళ్ళాడు. వాళ్ళ నాన్న అబ్రహాము బలిపీఠం కట్టాడు, ప్రార్థన చేసాడు. ఇస్సాకు పొలములో ధ్యానించడానికి వెళ్ళాడు. దేవునితో గడిపినప్పుడు ఆ ఆశీర్వాదం బహుగొప్పగా ప్రభువు చేస్తారు. మీరు మీ కుటుంబ జీవితంలో కూడా వాక్యధ్యానం, కుటుంబ ప్రార్థనలో దేవునితో గడపండి.

నీవు పది సంవత్సరాలు దేవునితో గడపకుండా ఉంటే నీవు దేవునిని కలుసుకున్నప్పుడు ఆయన కూడా బాధపడతారు. ఒక భార్య తన భర్త పదికోట్లు డబ్బులు తేవాలని కోరుకుంటుందా? భర్త తనతో మాట్లాడాలని కోరుకుంటుందా? ఇద్దరు స్నేహితులు డబ్బులతో వారి సంబంధాన్ని కట్టుకొంటారా? ఆత్మీయతతో వారి సంబంధాన్ని కట్టుకొంటారా? భార్యభర్తలైనా, ఫ్రెండ్స్ అయినా ఎవరైనా మీరు సహవాసం చేయడంలోనే బలం ఉంటుంది. ఇస్సాకు పొలములో ధ్యానించడానికి వెళ్ళాడు. వాళ్ళ నాన్న గారు వేసిన పునాదులను బలపరచుకొంటూ వెళ్ళాడు. మన పితరులు ఏ మార్గాన్ని ఎన్నుకున్నారు. వాళ్ళనాన్న గారు వేసిన దానికంటే ఇంకా లోతైన పునాదుల్లో భక్తి జీవితం కట్టుకోవడానికి ఇస్సాకు వెళ్ళాడు. మన పితరులు వారు దేవుని కొరకు బ్రతకడంలో వారి నిర్ణయాలు వారు దేవుని కొరకు నడిచింది ఎంతో గొప్ప ఆశీర్వాదంగా దేవుడు చేసాడు. మనం కూడా మన పితరులు ఎలా నడిచారు, వాక్యంలో ఏమి వ్రాయబడియున్నదో గ్రహించుకొని, ఎప్పుడైతే మన పితరుల మార్గాన్ని ఎన్నుకొంటామో అప్పుడు దేవుని చేత మనం దీవించబడతాము. ఇస్సాకు నూరంతల ఫలము చూడడానికి, దేవుని చేత ఆశీర్వదించబడటానికి కారణం ఆయన దేవుని చిత్తానికి వ్యతిరేకంగా తన ఇష్టం ఎప్పుడూ చేయలేదు. ఇప్పుడు ఇస్సాకుకి 40 సంవత్సరాలు వచ్చినవి పెండ్లి చేయాలి. అబ్రాహాము ఎలీయెజెరుని పంపించాడు అమ్మాయిని తీసుకురమ్మని. తీసుకొచ్చిన అమ్మాయిని ఇస్సాకు వివాహం చేసుకున్నాడు. దేవుని చిత్తాన్ని ఎప్పుడూ

త్రోసివేయలేదు. ఇస్సాకుని బలిపీఠం మీద పెట్టి కత్తి ఎత్తాడు అబ్రాహాము. ఇస్సాకు ఎదురు మాట మాట్లాడలేదు. మనం బలం ఏమిటో తెలుసా? దేవుని చిత్తానికి అప్పగించకొనడమే మన బలం. మనం ఆలోచన చేసేదానికి భిన్నమైనది కనిపించినా మనం దేవుని చిత్తానికి లోబడాలి. మనం ఆయన చిత్తం చేసినప్పుడు మనం ప్రభువు చేత ఖచ్చితంగా ఆశీర్వదించబడతాము. అందులో ఇంక ఏమాత్రం మనం సందేహపడవలసిన అవసరం లేదు. ఖచ్చితంగా దేవుడు ఈ పరిచర్యను దీవిస్తాడు. దీని వెనుక పేద ప్రజల కన్నీళ్ళు పరిశుద్ధుల ప్రార్థనలు ఉన్నవి. దేవుని యొక్క ఆశీర్వాదపు హస్తం ఉంటుంది. అది మనం విశ్వసించి ముందుకు వెళ్ళాలి.

**"ఇస్సాకు భార్య గొడ్రాలు గనుక అతడు ఆమె విషయమై యెహోవాను వేడుకొనెను. యెహోవా అతని ప్రార్థన వినెను గనుక అతని భార్యయైన రిబ్కా గర్భవతి ఆయెను' ఆది 25:21.**

ఇస్సాకు గొప్ప ప్రార్థనా పరుడు. తన సమస్యను దేవుని దగ్గరకు తీసుకెళ్ళాడు. యెహోవా ఇస్సాకు చేసిన ప్రార్థన విన్నాడు. మన జీవితంలో దేవుని చేత నూరంతల ఆశీర్వాదం చూడాలంటే మనం దేవుని మీద ఆనుకొని దేవునికి మన సమస్య చెప్పాలి. మనుష్యులకు చెపుతున్నామా? దేవునికి చెపుతున్నామా? దేవునికి చెపితే మనుష్యుల దగ్గరకు వెళ్ళవలసిన అవసరం లేదు. హన్నా తనకు బిడ్డలు లేని విషయం దేవునికి చెప్పింది. ఇక మనుష్యుల దగ్గర చెప్పవలసిన అవసరం రాలేదు. ఇస్సాకు గొప్ప ప్రార్థనా పరుడు. మనం ప్రతిదీ ప్రార్థనా పూర్వకముగా చేయగలిగితే గొప్ప ఆశీర్వాదం ఉంటుంది. ఇస్సాకు గొప్ప ప్రార్థనాపరుడు అందుకే నూరంతల ఫలం చూడగలిగాడు. ఎంత మొర్రపెడతామో అంత సమీపంగా దేవుని దగ్గరకు వస్తాము. అంత గొప్ప ఆశీర్వాదం చూస్తాము. ఎందుకని ఇస్సాకు నూరంతల ఆశీర్వాదం చూసాడో మనం గమనిస్తే ఆ సంవత్సరం విత్తనం వేసి అని వ్రాయబడి ఉంటుంది.

**"ఇస్సాకు ఆ దేశమందున్నవాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలముపొందెను. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక ఆ మనుష్యుడు గొప్పవాడాయెను" ఆది 26:12.**

ఆ సంవత్సరం అంటే అంతకముందు వేయలేదు. అంతకముందు పశువులున్నాయి వారికి. ఇప్పుడు ఇస్సాకు విత్తనం వేసే క్రొత్త పని పెట్టాడు.

ఏ కష్టము చేసినను లాభమే కలుగును” సామెతలు 14:23. అని వ్రాయబడి ఉంది. తన పితరులు నడిచిన మార్గములో ఒక మెట్టు పైకెక్కాడు ఇస్సాకు. మనం ఆలోచన చేసి పనిచేయాలే గాని దేవుడు ఆశీర్వదించకుండా ఉండరు. ఇస్సాకు తానే విత్తనం వేసాడు గాని వేరొకరితో వేయించలేదు. వాళ్ళ నాన్న దగ్గర 318 మంది పనివారుండేవారు. ఎవరిని విత్తనాలు వేయమన్నా వేస్తారు. మనం నడుము వంచి ఎంత వర్క్ చేస్తామో అంత ఆరోగ్యంగా ఉంటాము అంత ఆశీర్వదించబడతాము. నేను చేయాలి అనే మనస్సాక్షి ఉండాలి. ఇస్సాకు తానే విత్తనం వేసాడు. దేవుడు దానిని చూసాడు. ఇంత ఐశ్వర్యవంతుడు తానే వేస్తున్నాడేమిటి? మీరు ఎప్పుడు ఒకటి గుర్తుపెట్టుకోండి పనిచేసేవాడంటే దేవునికి ఎంతో ఇష్టం. చురుకుగా ఉండుట గొప్ప భాగ్యం. ఇస్సాకు విత్తనం వేయవలసిన అవసరం లేదు. వేసి నూరంతల ఫలం చూసాడు. నీవు కష్టపడి పనిచెయ్యి. దేవుడు నీ కష్టాన్ని ఆశీర్వదిస్తాడు. అందులో ఏ మాత్రం సందేహం లేదు. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక క్రమక్రమంగా గొప్పవాడయ్యాడు.

ఇస్సాకు దీవించబడటానికి ఉన్న బలమైన కారణం ఏమిటంటే ఆత్మసంబంధమైన జీవితాన్ని ఎంచుకున్నాడు. వాక్యధానంలోనైనా, ప్రార్థన విషయంలోనైనా పరిశుద్ధతలోనైనా, క్రమములోనైనా ఎక్కడా తన జీవితంలో తప్పిపోకుండా పనిచేసాడు. ఇస్సాకుకి ఇష్మాయేలు తెలుసు హాగరు తెలుసు. కెతూరా తెలుసు కెతూరా సంతానం తెలుసు. వాళ్ళ నాన్న నడిచిన మార్గం తెలుసు. ఇస్సాకు కుడికి గాని ఎడమ గాని తొలగక ఆత్మసంబంధమైన ప్రాకారాలు కట్టుకొన్నాడు. నీవు పనిచేసే స్థలములో రకరకాల స్వభావాలు కలిగిన వారుంటారు. ఎవరు ఎలా నడిచినా నీకు సంబంధం లేదు. నీవు ప్రత్యేకంగా ఉండాలి. మనం హృదయపూర్వకముగా ప్రార్థన చేద్దాము. మన దేవుడు నమ్మదగిన దేవుడు. నీవు విత్తు దేవుడు దానిని ఆశీర్వదిస్తాడు. దేవుడు మనకు ఇచ్చిన అవకాశమును ప్రజలను దేవుని దగ్గరకు నడిపించడానికి పరిశుద్ధమైన సువార్త చెప్పడానికి మన జీవితమే ఒక బైబిలుగా పనిచేయాలి. మీరు ఆలోచించకుండా సందేహించకుండా దేవుని యొక్క అదృశ్యమైన హస్తము క్రిందికి రండి. వాక్యాన్ని ధ్యానించండి. ప్రార్థనా జీవితాన్ని కట్టుకోండి విత్తనం వేయండి. గొప్ప ఫలాన్ని చూస్తారు. దేవుడు నూరంతల ఆశీర్వాదం మన మీద ఉంచును గాక! –ఎడిటర్

# ఆపదలో దాగిన అవకాశం

**"గొఱ్ఱెలను కాయుచుండ సింహమును ఎలుగుబంటియును వచ్చెను"**

**-1సమూ. 17:34.**

దేవునిలో నమ్మిక ఉంచిన యువకుడైన దావీదుతో పరిచయం కావడం మనకి బలాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తుంది. దేవుని పై విశ్వాసం మూలంగా అతను ఒక సింహాన్ని, ఎలుగుబంటిని చంపాడు. అటుపైన బలాఢ్యుడైన గొల్యాతును హతమార్చాడు. గొర్రెల మందను చెదరగొట్టడానికి వచ్చిన ఎలుగుబంటి దావీదు పాలిట గొప్ప అవకాశమైంది. ఆ సింహం వచ్చినప్పుడు అతను గనుక తొట్రుపడి పారిపోయి ఉంటే దేవుడు అతనికోసం ఉంచిన అవకాశాన్ని జారవిడుచుకునేవాడు. ఇశ్రాయేలీయులకు దేవుడు ఏర్పరచిన రాజుగా ఎన్నటికీ పట్టాభిషేకం పొందేవాడు కాడు.

సింహం రావడం దేవుని ప్రత్యేక ఆశీర్వాదమని ఎవరూ అనుకోరు. ఇది హడలుగొట్టే సంఘటనే. కాని సింహం మారువేషములో ఉన్న దేవుని అవకాశం. మనకెదురయ్యే ప్రతి ఆపదను మనం సరైన దృష్టితో చూసినట్లైతే అవన్నీ అవకాశాలుగా మారిపోతాయి. మనకు వచ్చే ప్రతి శోధన మన పెరుగుదలకు ఒక మెట్టు.

సింహం వచ్చినప్పుడు దాని ఆకారం ఎంత భయానకంగా ఉన్నప్పటికీ దానిని దేవుడు ఇచ్చిన అవకాశంగా గ్రహించండి. దేవుని సన్నిధి గుడారాన్ని మేక వెంట్రుకలతో అలంకరించారు. దానిలో ఏ విధమైనా మహిమ ఉంటుందని చూసిన వాళ్ళు ఎవరనుకోగలరు? అలాంటి కంటికింపుగా లేనివాటిల్లోనే దేవుని మహిమ దాగి ఉంటుంది. శోధనల్లో, శ్రమల్లో, ఆపదల్లో, దారిద్ర్యంలో మనం దేవుని చూడగలిగేలా ఆయన మన కన్నులు తెరుస్తాడు.

# నీ కొరకైన క్రీస్తు కేక

**'మధ్యాహ్నము మొదలుకొని మూడు గంటలవరకు ఆ దేశమంతటను చీకటికమ్మెను. ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు ఏలీ, ఏలీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేకవేసెను. ఆ మాటకు నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము" మత్తయి 27:45-46.**

యేసుప్రభువు వారు సిలువలో శ్రమపడుతున్నారు. మిట్టమధ్యాహ్న తండ్రికి కుమారుడికి ఎడబాటు వచ్చింది. తండ్రి చెయ్యి విడిచాడు. నా దేవా నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివి అని బిగ్గరగా కేకవేసెను. యేసుప్రభువు మానవరూపములో ఉండి బిగ్గరగా కేకవేసాడు. అదే యేసుప్రభువు వారు కలుగును గాక అనినప్పుడు సృష్టి యావత్తు కలిగింది అని ఆదికాండములో మనం చూడవచ్చు. అలాంటి మహా సృష్టికర్త. **"ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను" కొలస్సి. 1:15**

మానవ శరీరంలో ఉన్నప్పుడు సిలువలో కేక వేరేగా ఉంది. సృష్టి ప్రారంభంలో మాట వేరుగా ఉంది. మానవరూపములో ఉన్నప్పుడు మన పాపాములనుండి రక్షించుటకు తండ్రి చెయ్యి విడిచిపెట్టాడు. **"నా దేవా, నా దేవా, నీవు నన్నేల విడనాడితివి? నన్ను రక్షింపక నా ఆర్తధ్వని వినక నీవేల దూరముగానున్నావు?" కీర్తన 22:1,2.**

**"యెహోవా, నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను నా ఆశ్రయదుర్గమా, మౌనముగా ఉండక నా మనవి ఆలకింపుము నీవు మౌనముగా నుండినయెడల నేను సమాధిలోనికి దిగువారివలె అగుదును నేను నీకు మొఱ్ఱపెట్టునప్పుడు నీ పరిశుద్ధాలయము వైపునకు నా చేతుల నెత్తునప్పుడు నా విజ్ఞాపన ధ్వని ఆలకింపుము" కీర్తన 28:1,2.** నా మనవి ఆలకింపుము. రక్షణ కార్యాన్ని ముగిస్తున్న గడియలో తండ్రికి కుమారుడికి సంబంధం తెగిపోయింది. ఈ దినాలలో మనం మొబైల్స్ వాడుతూ ఉంటాము. ఫోన్ చేసినప్పుడు కొన్నిసార్లు మనకి నెట్‌వర్క్ కనెక్షన్ లేదు అని వస్తుంది. కారణం

ఈ మొబైల్స్‌కి శాటిలైట్‌కి కనెక్షన్ తెగిపోతుంది. దానిని మరలా పునరుద్ధరించినప్పుడు కనెక్షన్ కలుస్తుంది. యేసుప్రభువు వారు మరణవేదన పొందుతున్నారు ఎందుకంటే లోకపాప భారాన్నంతటిని మోస్తున్నాడు. ప్రయాసపడి భారం మోసుకొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి అంటున్నాడు. ఆ పాప భారం అంతా మోసేటప్పుడు యేసుప్రభువు వారి శ్రమను తండ్రి చూడలేక చెయ్యి విడువవలసి వచ్చింది. మనందరి కొరకు చెయ్యి విడిచాడు. కాని మనతో ఉంటానని చెప్పినప్పుడు మన చెయ్యి పట్టుకొన్నాడు. సిలువ మీద ప్రభువు వారు బిగ్గరగా కేక వేసాడు. గొల్గతా కొండలో యేసుప్రభువు వారు కేక వేసినప్పుడు ప్రతిధ్వనించింది ఆ కేక. నా కోసం నీ కోసమే ఆ కేక. ప్రభువైన యేసుక్రీస్తు వారు ఆక్రందించారు. మనం కూడా నా పాప భారం మోసావు నీకు స్తోత్రం అని చెప్పాలి. నా కొరకు ఏడ్వవద్దు మీ కొరకు మీ పిల్లల కొరకు ఏడవమని చెప్పారు. పాపభూయిష్టమైన ఈ లోకంలో ఉన్న ప్రజల చెవులలో ఈ కేక ప్రతిధ్వనించాలి. అప్పుడే సిలువలో వేసిన కేకకి అర్థం పరిసమాప్తమౌతుంది. నా దేవా నా దేవా నన్నేల చేయి విడిచితివి అని బిగ్గరగా కేక వేసాడు. మీ భారం అంతా నేను సిలువలో మోసాను మీరు మోయక్కర్లేదు మీరు స్వతంత్రులు. మీలో పాప భారం ఉండనీయకండి. యేసుప్రభువు వారు సిలువ మోస్తుంటే మరొక వ్యక్తి వచ్చాడు ఆ వ్యక్తి కురేనీయుడైన సీమోను. ఆ సిలువ నీవు నేను మోయాలి. అందుకే ప్రభువు వారు ఒకమాట చెప్పారు ప్రతివాడు తనను తాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తుకొని నన్ను వెంబడించాలి. మనల్ని మనం తగ్గించుకోవాలి. దేవుని సన్నిధిలో మన హృదయాన్ని యథార్థంగా కుమ్మరించుకోవాలి. మన హృదయాల్లో ఉన్న పాప భారాన్ని ప్రభువు దగ్గర ఒప్పుకోవాలి.

**“తన అతిక్రమములకు పరిహారమునొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు. యెహోవా చేత నిర్దోషి అని యెంచబడినవాడు ఆత్మలో కపటములేనివాడు ధన్యుడు” కీర్తన 32:1,2.** పాపాన్ని ఒప్పుకొని విడిచిపెట్టినప్పుడు పరిహారం దొరుకుతుంది. అందుకే సర్వలోక మానవాళి పాపభారాన్ని ప్రభువు సిలువలో మోసాడు. గనుక మనం యథార్థంగా ఒప్పుకోవాలి. అలా ఒప్పుకొనిన వారు ధన్యులు. అలా ఒప్పుకొనినప్పుడు ప్రభువు మనలను పాపం లేని వారిగా నిర్దోషులుగా చేస్తారు. ఇది ఎలా సాధ్యం? **“అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల మనము**

**అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను కడిగి పవిత్రులుగా చేయును" 1యోహాను 1:7,8.**

దేవుడు వెలుగైయున్నాడు. ఆయన ప్రేమా మయుడైయున్నాడు. మనము ఆయన వెలుగులో నడిచిన యెడల ఆయన మనలను నీతిమంతులుగా చేయును. పాపంలో ఉన్న వ్యక్తి చీకటిలో కార్యాలు చేయడానికి మనుష్యులకు కనపడకుండా చేయాలనుకొంటాడు. ఆ రహస్య పాపాలు, తలంపులో హృదయాంతరంగంలో ఉంటాయి. అవి మనుష్యులకు కనపడవేమో గాని దేవునికి మాత్రం నీవు మరుగు చేయలేవు. ఆయన సర్వాంతర్యామి.

**"మనముకూడ ప్రతి భారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" హెబ్రీ. 12:2.** సుళువుగా చిక్కులబెట్టు పాపం అంటే, దారం చిక్కుపడుతుంది. దానిని తీయడానికి కొన్నిసార్లు కష్టపడతాము. అలా మనకు తెలియకుండానే లోకంలో ఉన్నాము గనుక సుళువుగా ఆ పాపాలు చిక్కుల పెడతాయి. ఆ పాపాలను మనం ఒప్పుకోవాలి విడిచిపెట్టాలి. ఒప్పుకొనిన పాపాలు ప్రభువు క్షమిస్తారు. ఒప్పుకోని పాపాలు వారి వెంట వస్తాయి. ఆ పాపాలు వలన చిట్టచివరికి వచ్చు జీతము మరణము. శారీరక మరణం అందరికి సంభవిస్తుంది. కాని రెండవ మరణంలో అగ్ని ఆరదు పురుగు చావదు. అక్కడ ఆక్రందన చేసే బదులు బ్రతికి ఉన్నప్పుడు పాపాన్ని ఒప్పుకొని జీవించినట్లైతే యేసుప్రభువు వారి సిలువ రక్తం మనలను కడిగి పవిత్రులుగా చేస్తుంది.

**"తన అతిక్రమములకు పరిహారమునొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు. యెహోవాచేత నిర్దోషి అని యెంచబడినవాడు ఆత్మలో కపటములేనివాడు ధన్యుడు" కీర్తన 32::1,2.** పాపము ఒప్పుకొన్నప్పుడు దేవుడు మనలను పవిత్రులుగా చేస్తారు. ఒప్పుకోనప్పుడు ఆ పాపం మన హృదయంలో ఉండి మనలను గలిబిలి చేస్తుంది. ఆందోళనకు గురి అవుతాము. అందుకే పాపాన్ని ఒప్పుకొని విడిచిపెట్టమని వాక్యం చెపుతుంది. అందుకొరకే ప్రభువు వారు సిలువలో కేక వేసారు. అలా మనం పాపం విషయమై బిగ్గరగా కేకవేసి దేవుని యొక్క క్షమాపణ కోరుకొని దేవుని యొక్క రక్తము ద్వారా కడగబడి

పరిశుద్ధంగా జీవించాలని వాక్యం తెలియజేస్తుంది. **“మనము పాపములేనివారమని చెప్పుకొనిన యెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు”. 1యోహాను 1:8.** పాపం లేదు నాలో అని చెప్పుకొంటే మనలో సత్యం లేదు. కొంతమంది చిన్నప్పటి నుండి నేను నీతిమంతుడిగానే ఉన్నాను అని గర్వించి చెపుతుంటారు. ఒక్కడే ఉన్నాడు పాపం లేకుండా, ఆయనే యేసుక్రీస్తు. ఆయన మన పాపముల నుండి మనలను విమోచించడానికి, మనలను నిర్దోషులుగా చేయడానికి ఆయన మాత్రమే అర్హత కలిగిన వాడుగా ఉన్నాడు.

**“మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును”. 1యోహాను 1:9.** ఎంత ధన్యత. దేవుడు ఎందుకు కేక వేసాడంటే నిన్ను నన్ను పరిశుద్ధులుగా చేయాలని కేకవేసాడు. తండ్రిని వేడుకొంటున్నాడు. యేసుప్రభువునైనా విడిచిపెట్టడానికి ఇష్టపడ్డాడు గాని మనలను మాత్రము విడిచిపెట్టడం ఆయనకు ఇష్టం లేదు. నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి. అది దేవుని చిత్తం. పరిశుద్ధులుగా ఉండుటకే మనలను పిలిచాడు. అందుకే ఆయన సిలువ యాగం చేసాడు. దానిని మనం సార్ధకం చేసుకోవాలంటే దావీదు చెప్పినట్లుగా అతిక్రమములను ఒప్పుకొనేవారిగా ఉండాలి. **“మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు” 1యోహాను 1:9,10**

యేసుప్రభువు వారి ఆత్మ మనలో ఉండదు. దుష్టాత్మ యూదాలోకి వచ్చింది. లోకాన్ని ముద్దు పెట్టుకొన్నాడు. ప్రభువుని నమ్మాడు. వాని హృదయంలో సాతాను ప్రవేశించాడు. యేసుప్రభువు బోధలు విన్నాడు. ప్రభువుని ప్రేమించానని కపట నాటకం ఆడాడు. ముద్దుపెట్టుకొన్నాడు. దుర్మార్గాన్ని చేసాడు. వ్యాపారం చేసాడు దేవునితో. చివరికి ఆత్మహత్య చేసుకొని నశించిపోయాడు. యూదా పాపాన్ని ఒప్పుకొని యుంటే ప్రభువు పరిచర్యలో ఉండేవాడు. ప్రభువు పరిచర్యకి దూరం అయిపోయి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎందుకంటే పాపభారాన్ని ప్రభువుకి

అప్పగించలేదు. **ప్రయాసపడి భారం మోసుకొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి అని ప్రభువు సెలవిచ్చారు.** ఈ లోకంలో అనేకమంది ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. యౌవనస్థుల దగ్గర నుండి పెద్దల వరకు. యూదా పాపాన్ని ఒప్పుకొంటే జీవించేవాడు. పాపాన్ని ఒప్పుకొనిన వారు దేవుని మాట చేత నిర్దోషిగా తీర్చబడతారు. వారు దేవుని యొక్క మాట చేత క్రీస్తు రక్తంలో కడగబడి పవిత్రులుగా చేయబడతారు. **"మిమ్మును కడుగుకొనుడి శుద్ధి చేసికొనుడి. మీ దుష్క్రియలు నాకు కనబడకుండ వాటిని తొలగింపుడి. కీడుచేయుట మానుడి మేలుచేయ నేర్చుకొనుడి న్యాయము జాగ్రత్తగా విచారించుడి, యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు రండి మన వివాదము తీర్చుకొందము మీ పాపములు రక్తమువలె ఎఱ్ఱనివైనను అవి హిమము వలె తెల్లబడును కెంపువలె ఎఱ్ఱనివైనను అవి గొఱ్ఱబొచ్చువలె తెల్లని వగును. యెషయా 1:16-20.** పదేపదే క్రీస్తురక్తంలో కడగబడాలి. ప్రతి క్షణం ప్రతి దినం కడగబడాలి. నేను పాపాలు ఒప్పుకొన్నానండి పది సంవత్సరాల క్రితం అంటే కుదరదు. పాపలోకంలో మనం జీవిస్తున్నాము. మన హృదయంలో ఆలోచనలు మలినం అవుతూనే వుంటాయి. కనుక దేవుడు అంటున్నాడు రండి మన వివాదం తీర్చుకొందుము. అందుకే ప్రభువు వారు సిలువలో కేకవేసారు. మన పాప భారం ఆయన మీద మోపాడు దేవుడు. మన పాప భారం ఆయన మీద మోపితే ఎంత తేలిక అవుతుంది.

**"కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసునందున్నవారికి ఏ శిక్షావిధియు లేదు" రోమా 8:1.** పాపం నుండి తప్పించబడతాము. నరకం నుండి తప్పించబడతాము. పరిశుద్ధులుగా తీర్చబడతాము. **"మీరు కృపకే గాని ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు గనుక పాపము మీ మీద ప్రభుత్వము చేయదు" రోమా 6:14.**

పాపపు అధికారము క్రింద పాపపు దాసత్వం క్రింద పాపము యొక్క యాజమాన్యంలో మనం జీవించము. దేవుని యొక్క కృపలో జీవిస్తూ పరిశుద్ధులుగా యథార్థవంతులుగా నిష్కళంకులుగా ఉంటాము. లోపల ఒకటి బయట ఒకటి కాదు. సంఘంలో ఒకలాగ వెలుపల ఒకలాగ మనము జీవించము. రెండు రకాలైన జీవితాలు మనకు ఉండవు. ఒకే జీవితం అదే పరిశుద్ధమైన జీవితం. ఆ పరిశుద్ధ జీవితం చేయుట కొరకు నిన్ను నన్ను ఎంచుకొన్నారు. అందుకే సిలువలో కేక వేస్తున్నారు. మన కొరకు కేక వేసిన దేవుని కొరకు మన

కేకను ఆయనకు అప్పగించి నా పాప భారాన్ని నీవు మోసావు నా నరక శిక్షను నీవు తప్పించావు నీకు స్తోత్రాలు నన్ను పరిశుద్ధురాలిగా పరిశుద్ధుడిగా చేసావు నీకు స్తోత్రం నన్ను యథార్ధవంతుడిగా చేసావు నీకు స్తోత్రం అని చెప్పితే ఎంతో ఆశీర్వాదం. యెహోవా చేత నిర్దోషి అని ఎంచబడిన వారు ధన్యులు. మనం ఆ విధంగా దేవుని యథార్ధతలో జీవిత కాలమంతా జీవిస్తూ యేసుప్రభువు వారు సిలువలో బిగ్గరగా వేసిన ఆ కేకకు ఫలితంగా ఆయన నిత్యరాజ్యంలో పరిశు ద్ధపట్టణంలో పవిత్రంగా పరిశుద్ధులుగా నిరంతరం ఆయనను స్తుతించి ఆరాధించే వారిగా దేవుడు మనలను దీవించునుగాక!

ఆయన మనకొరకు వధింపబడిన గొఱ్ఱెపిల్ల అని ప్రకటన గ్రంథంలో వ్రాయబడి ఉంటుంది. మన హృదయాన్ని తెరచి మన జీవితాన్ని కడుక్కుంటూ పరిశుద్ధులుగా యథార్ధవంతులుగా జీవిద్దాము. తద్వారా క్రీస్తుప్రభువు వారు సిలువలో ఆయన పడిన శ్రమ ఆయన చిందించిన రక్తం మనలను మన కుటుంబాలను మన పరిచర్యలను పరిశుద్ధపరుస్తుంది. పరిశుద్ధపరచబడి పరిశు ద్ధుడైన దేవునిని ఆరాధిద్దాము,సేవిద్దాము,పూజిద్దాము,కొనియాడదాము, నిర్దోషులుగా నిష్కళంకులుగా జీవిద్దాము. అలా జీవించినప్పుడే మనం పరలోకానికి అర్హులుగా ఉంటాము. లేకపోతే పరలోకాన్ని పోగొట్టుకొంటాము. మత్తయి సువార్తలో ఉంటుంది ప్రభువా ప్రభువా అని పిలుచు ప్రతివాడు నా రాజ్యంలోకి అర్హులు కాదు నా తండ్రి చిత్త ప్రకారంగా జీవించినవాడే అర్హుడు. తండ్రి చిత్తం కొలమానం పరిశుద్ధత. కనుక దేవుని యొక్క కొలమానంలో ఆయన పరిశు ద్ధతతో కొలిచినప్పుడు ఆయన కొలమానంలో సరిగా లేకపోతే పరలోకాన్ని పోగొట్టుకొంటాము. ఒకడు లోకమంతా సంపాదించి తన ప్రాణాన్ని పోగొట్టుకొంటే వానికేమి ప్రయోజనం?

కాబట్టి దేవుని బిడ్డలారా, క్రీస్తు సంఘమా ఆయన కార్చిన రక్తం ఆయన సిలువలో పడిన శ్రమకు మన జీవితం ప్రతిబింబించాలి. క్రీస్తు ప్రభువులా నాలో పాపం ఉన్నదని ఎవరైనా ఋజువు చేయగలడా అని సవాలు చేసిన క్రీస్తు ప్రభువు వారిని హత్తుకొని ఆయన ఎదుట యథార్థంగా జీవించి పరలోక రాజ్యాన్ని సంపాదించుకొందుము గాక!

# అంగడిలో అద్భుతం

టెస్ అనే చిన్న బాలిక తన పడక గదిలోనికి వెళ్ళి తాను భద్రంగా దాచుకున్న ఒక చిన్న డబ్బాని బయటకు లాగి దానిని తెరచి అందులో నున్న చిల్లర నాణెములన్నింటిని జాగ్రత్తగా లెక్కపెట్టుకున్నది. మూడుసార్లు లెక్కించినది. మొత్తము సరిగానే ఉన్నది. ఎలాంటి తేడా లేదు. మరలా ఆ నాణెములను జాగ్రత్తగా డబ్బాలో వేసి మూతనుపెట్టి తలుపు తెరచుకొని బయటకు వచ్చి దగ్గరలోనున్న “రెక్సల్ డ్రగ్ స్టోర్” అనే ముందుల షాపుకు వచ్చినది. అంగడి వాడు తనను గమనించాలని సహనముతో కనిపెట్టినది టెస్. కాని ఈ సమయములో అతడు చాలా బిజీగా ఉన్నాడు. శబ్దము వచ్చేటట్లుగా తన కాళ్లను కదిపింది. ఫలితము లేదు. కరుకైన శబ్దము వచ్చేటట్లుగా తన గొంతును సవరించుకొన్నది. కాని దాని వలన కూడా ప్రయోజనం లేకపోయింది. తరువాత ఆమె తన డబ్బాలో నుండి ఒక నాణేన్ని తీసుకొని గాజు బల్లమీద దానితో కొట్టినది. ఈసారి తన ప్రయత్నం ఫలించినది.

“నీకేం కావాలి?” విసుక్కుంటూ అడిగాడు అంగడివాడు. ఆమెనుండి జవాబు రాకముందే “చికాగో నుండి వచ్చిన నా తమ్మునితో మాట్లాడుతున్నాను. చాలా కాలంగా నేను వాడిని చూడలేదు” అన్నాడు. “మంచిది నేను కూడా నా తమ్ముని గురించి మాట్లాడాలని వచ్చాను” అన్నది టెస్. “ఆ ఏంటీ! ఏమి కొనడానికి వచ్చావ్” అన్నాడు అంగడి వాడు. “నా తమ్ముడి పేరు ఆంథ్రూ. వాడి తలలో ఏదో కణితి వంటిది పెరుగుతుందట. ఒక అద్భుతం మాత్రమే వాడిని రక్షించగలదు అని మా డాడీ చెప్పాడు. మరి ఒక అద్భుతం ఖరీదెంత?” అని అడిగింది టెస్.

“చిన్ని పాపా! మేమిక్కడ అద్భుతాలు అమ్మడం లేదు. నీకేమీ సహాయం చేయలేను. క్షమించు” అని తన స్వరాన్ని తగ్గించి అన్నాడు అంగడి వాడు. “అయ్యా! దాని వెల చెల్లించడానికి నా దగ్గర డబ్బులున్నాయి. అవి చాలకపోతే మిగిలినదానిని తీసుకొని వస్తాను. దాని ఖరీదెంతో మొదట చెప్పండి” అన్నది టెస్. ఆ అంగడి వాని సోదరుడు గౌరవప్రదమైన వస్త్రములు ధరించుకొని యున్నాడు. అతడు

క్రిందికి వంగి "నీ తమ్ముడికి ఎలాంటి అద్భుతము అవసరము?" అని అడిగాడు.

"నాకు తెలియదు, వాడికి నిజంగా బాగాలేదని మాత్రం నాకు తెలుసు. వాడికి ఆపరేషన్ అవసరమని మమ్మీ చెప్తుంది. కాని మా డాడీ దగ్గర అంత డబ్బులేదు. కాబట్టి నా డబ్బును వాడాలనుకుంటున్నాను." అని తన కండ్లను నిమురుకుంటూ జవాబిచ్చింది.

"నీ దగ్గర ఎంత డబ్బున్నది?" చికాగో నుండి వచ్చిన వ్యక్తి అడిగాడు. "ఒక డాలరు, పదకొండు సెంట్లు, నా దగ్గర వున్నందంతా అదే కాని యింకా కొంచెం డబ్బు అవసరమైతే తీసుకుని వస్తాను" అని జవాబిచ్చింది టెస్.

"మంచిది, ఎంత ఆశ్చర్యం!" అని నవ్వుతూ "నీ తమ్ముడికి అవసరమైన అద్భుతం ఖరీదు సరిగ్గా ఒక డాలరు పదకొండు సెంట్లు మాత్రమే" అని అన్నాడు ఆ వ్యక్తి.

అతడు ఒక చేతితో ఆ డబ్బును తీసికొని రెండవ చేతితో ఆమెను పట్టుకొని మీ యింటికి నన్ను తీసికొని వెళ్ళు నేను నీ తమ్ముని చూసి నీ తల్లిదండ్రులను కలవాలి. మీకు అవసరమైన అద్భుతం నా దగ్గర ఉన్నదేమో చూద్దాం అన్నాడు.

గౌరవప్రదమైన దుస్తులతో ఉన్న ఆ వ్యక్తి డా.కారల్‌టన్ ఆర్మ్‌స్ట్రాంగ్. అతడు నరముల వ్యాధులకు ఆపరేషన్ చేయడంలో నిపుణుడు. అతడు టెస్ యింటికి వచ్చి తల్లిదండ్రులతో మాటలాడి ఆ పిల్లవానికి ఉచితముగా ఆపరేషన్ నిర్వహించాడు. అనతికాలములోనే టెస్ యొక్క తమ్ముడు కోలుకొని ఆరోగ్యవంతునిగా యింటికి తిరిగి వచ్చాడు.

ఒకదాని తరువాత ఒకటి కాకతాళీయముగా సంభవించిన ఈ సంఘటనలను గూర్చి మమ్మి డాడి సంతోషముగా మాటలాడుకొంటూ ఉన్నారు. ఆ ఆపరేషన్ నిజంగా ఒక అద్భుతమే. అది ఎంత ఖరీదైనదో! అని నాకు ఆశ్చర్యమౌతున్నది అని మమ్మి అన్నది. టెస్ నవ్వింది. ఆ అద్భుతం ఖరీదు ఒక్క డాలరు పదకొండు సెంట్లు మాత్రమే. దానితో పాటు ఒక చిన్నబిడ్డ యొక్క విశ్వాసం.

# క్రీస్తు కొరకు నిలబడుట

**'కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి" 1కొరింథి. 15:58.**

దేవుని యెదుట మనం స్థిరులుగా కదలని వారిగా ఉండాలి. మనం దేవుని నమ్ముకుంటాము కాని కొన్నిసార్లు కొన్ని పరిస్థితులు మనలను కదిలించివేస్తాయి. అప్పుడు మనం దేవుని కొరకు నిలబడలేము. మనం ప్రభువును అంగీకరించిన తరువాత ఎన్నోరకాలైన పరిస్థితులు యౌవనకాలంలో వస్తాయి. శ్రమలుంటాయి ఇరుకులుంటాయి. ఓటమి కూడా కొన్నిసార్లు ఉంటుంది. ఓటమి వచ్చిందని భక్తి జీవితంలో అస్థిరులుగా మనం ఉండకూడదు. మన జీవితంలో అన్నింటికంటే శ్రేష్టమైనది దేవునితో మనకున్న సంబంధాన్ని కాపాడుకొనుట. రెండవదిగా దేవుని కొరకు అన్ని పరిస్థితులలో కదలకుండా నిలబడాలి. కొన్నిసార్లు ఆరోగ్యం సహకరించదు. కొన్ని సార్లు మనం అనుకున్న జయాన్ని చూడలేము. మనం పరీక్షలు బాగా వ్రాస్తాము, కొన్నిసార్లు జాబ్ దగ్గరకి వచ్చినట్టే ఉంటుంది. మనం వస్తుంది అనుకున్న తరువాత అది మనకు కొన్నిసార్లు అందదు. దేవుడు ఏదైనా మన జీవితాలలో ఆపారు అంటే దాని వెనుక దేవునికి ఒక గొప్ప ఉద్దేశం ఉందని గ్రహించుకోవాలి. నీవు అనుకున్నది జరగలేదని వెంటనే దేవునికి నీవు దూరమై పోకూడదు. ఎందుకు దేవుడు ఆపారు. దీని వెనుక దేవుని చిత్తము ఏమైయుందో మనం గ్రహించుకోవాలి.

**"కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" మత్తయి 6:33.**

దేవుడు వాగ్దానం చేసారు. మనకు ఏది ఎప్పుడు అవసరమో దేవునికి తెలుసు. కాబట్టి మనం ఆయనయందు విశ్వాసం కలిగియుండాలి. భక్తి జీవితంలో మనం కదలని వారిగా స్థిరులుగా ఉండాలి. ఎప్పుడు మనం కదలనివారిగా స్థిరముగా ఉండగలుగుతామంటే దేవుని యొక్క శక్తి ఎమిటో దేవుని యొక్క

బలమేమిటో దేవుని యొక్క అధికారమేమిటో మనకు తెలియాలి. ఆయన సర్వాధికారి. ఆయన మన జీవితాలలో ఏదైనా చేయగలరు. ఆయన మనలను ప్రేమించి మనకొరకు ప్రాణం పెట్టారు. మన కొరకు ఆయన రక్తం అంతా చిందించారు. మనం నశించిపోవడం ఆయనకు ఇష్టం లేదు. సర్వమానవాళి కొరకై ఆయన వెల చెల్లించారు. ఆయన కుమారుని ఇవ్వడానికి ఆయన వెనుకతీయలేదు. మన అవసరలతలు ఖచ్చితంగా తీరుస్తారు. అట్టి విశ్వాసం మనకు ఉండాలి.

రెండవదిగా దేవునిని మనం ప్రేమించినప్పుడు మనం కదలకుండా ఉంటాము. స్థిరంగా నిలబడతాము ఎక్కడైనా ఎప్పుడైనా ఏ పరిస్థితులలోనైనా. అది లేమి అయినా కరువైనా వస్త్రహీనతైనా. దేవుని ప్రేమ నుండి ఏదీ నన్ను ఎడబాపలేదు అని పౌలు అంటారు. పౌలుకి చాలా పరిస్థితులు వచ్చినవి, చెరసాలలో ఉన్నాడు, రాళ్ళ దెబ్బలున్నాయి. కపట సహోదరుల వలన అపాయాలున్నాయి, బెత్తములతో కొట్టారు, రాళ్ళు రువ్వారు, ఈడ్చుకెళ్ళారు. ఎన్నో పోరాటాలున్నాయి. చనిపోయాడని పడేసారు. బొండలు వేసి బిగించారు. ఎన్ని పరిస్థితులు వచ్చినా అవేవీ పౌలును దేవుని నుండి దూరపరచలేదు. దేవుని కొరకు పౌలు కదలకుండా నిలబడ్డాడు. కారణం ప్రభువును అధికముగా ప్రేమించాడు.

దేవుని ప్రత్యక్షత పౌలుకి దమస్కు గేటు దగ్గర దొరికింది. అప్పుడు దేవుని స్వరము విన్నాడు. నిజముగా దేవునిని ప్రేమించలేదు. యేసుప్రభువు అంటేనే ఆయనకు చాలా కోపము. ఆయనను ఆరాధించేవారన్నా కోపమే. ధర్మశాస్త్రాన్ని అనుసరించి నడుస్తున్నాడు గాని ఆయన ఈ లోకానికి వచ్చారు, ఆయన మన కొరకు వెలచెల్లించారు, తిరిగి లేచారనే ఆ పునరుత్థాన శక్తిని పౌలు నమ్మలేదు. ధర్మశాస్త్రాన్ని పట్టుకొని నిష్ఠగలిగిన భక్తి చేస్తూ ఎవరైతే యేసుప్రభువుని నమ్ముకుని ఆరాధిస్తున్నారో వారిని హింసించాడు, స్తెఫను చావుకి దగ్గరుండి సమ్మతించాడు. కొంతకాలం పౌలు ఆటలు సాగాయి. దేవుడు చూసాడు పౌలు కేమైనా గ్రహింపు అవుతుందేమోనని. పౌలుకి గ్రహింపు అవ్వడం లేదు, దేవునికి పౌలు కావాలి, కాబట్టి దేవుడు పౌలుని దర్శించి సౌలా సౌలా నన్నేల హింసిస్తున్నావు

అన్నాడు. సంఘాన్ని బాధపెడుతున్నాడు, దేవుని బిడ్డలను బాధపెడుతున్నాడు అలాంటి సమయములో దేవుని స్వరం వినిన తరువాత పౌలు మనో నేత్రాలు తెరవబడ్డాయి. సిలువ వేయబడిన యేసుక్రీస్తును చూసాడు. దేవుని వెలుగు చూసాడు, ఇక పౌలు లోకానికి గ్రుడ్డివాడైపోయాడు. ఎప్పుడైతే మూడు దినములు ఉపవాసముండి ప్రార్థన చేసుకున్నాడో పాపపు పొరలు రాలిపోయినవి, రక్షణ పొందాడు. తన జీవితంలో తనకు కలిగే పరిస్థితులేవీ దేవుని ప్రేమ నుండి పౌలుని దూరపరచలేదు. మీరు ప్రభువుకి సమీపంగా రావాలి మీ పాత స్వభావం సిలువవేయబడాలి. మారుమనస్సు మీద, రక్షణ మీద మనస్సు పెట్టాలి. దేవుని వెలుగు మీ హృదయంలోకి రావాలి. దేవునిని విశ్వసించాలి. చూసి నమ్మిన వారికంటే చూడక నమ్మిన వారు ధన్యులు అని వ్రాయబడి ఉంది. ఈ మూడు మనకుంటే మనం కదలని వారిగా స్థిరులుగా ఉంటాము. మీరు దేవుని చిత్తానుసారముగా స్టడీస్ లేక జాబ్ నిమిత్తము ఫారెన్‌కి వెళతారు. అక్కడికి వెళ్ళిన తరువాత ఆ కల్చర్‌కి మీరు బానిసలవ్వరు. వాటికి వేరుగానే ఉంటారు. కారణం దేవుని ప్రేమను రుచి చూసారు, దేవుని సత్యాన్ని పట్టుకున్నారు. దేవుని శక్తి ఏమిటో మీకు అర్థమైంది. మీరు ఎక్కడికి వెళ్ళినా దేవుని కొరకు నిలబడగలిగిన కృప దేవుడు మీకు ఇస్తారు. కాబట్టి మనం దేవుని కొరకు కదలని వారిగా దేవుని కొరకు ఏ పరిస్థితులలోనైనా నిలబడేవారిగా ఉండాలి. మీ యౌవన జీవితాలు తొట్రిల్లకుండా ఆయన కాపాడతారు. దేవుని యొక్క ప్రేమతో మనం నింపబడి దేవుని యొక్క కృప మీద మనం ఆధారపడాలి. అనుక్షణం ప్రార్థించాలి ప్రార్థన మనకు ఊపిరై పోవాలి. మీరు కాలేజీలో ఉన్నా, నడిచినా, ల్యాబ్స్‌లో ఉన్నా, ఆఫీసులో ఉన్నా, వర్క్ చేస్తున్నా, ఫ్యామిలీతో ఉన్నా, అక్కడ కూడా దేవుని కొరకు నిలబడండి. సత్యం కొరకు మనం నిలబడాలి. నిలబడకుండా ఉండే పరిస్థితులు వస్తాయి. మన జీవితంలో మనముందుకు అటువంటి పరిస్థితులను అపవాది తీసుకొస్తాడు.

యోసేపు ఫోతీఫరు భార్య శోధిస్తున్నా యోసేపు కలవరపడిపోలేదు. దేవుని కొరకు పరిశుద్ధత కొరకు నిలబడ్డాడు. దేవుని వైపు చూసాడు, ఇది నాకు తగదు అనుకున్నాడు. ఆ ప్రాంతాన్ని వదిలి పక్కకి వెళ్ళిపోయాడు. చూడండి

తాను దేవుని కొరకు నిలబడ్డాడు మరియు ఆ స్థలాన్ని వదిలిపెట్టాడు, అయితే దేవుని వాక్యం వదిలిపెట్టలేదు. నేను ఏమిటి ఇంత నమ్మకంగా ఉంటే ఈ శోధన వచ్చింది అనుకోలేదు. అది తన మేలుకొరకే వచ్చిందని గ్రహింపు అయింది అందుకే ఆ స్థలాన్ని వదిలిపెట్టాడు. ఇక్కడ ఉండుట మంచిది కాదు తాను ఇక్కడే ఉంటే సాతాను తనను దోచుకొంటాడని ఆ స్థలాన్ని వదిలిపెట్టి పారిపోయాడు. మొదట దేవుడు తరువాతే ఉద్యోగం, మొదట దేవుడు తరువాతే స్నేహం. దుష్టసాంగత్యం మంచి నడవడిని చెరిపివేస్తుంది. మీరు చేసే స్నేహం అది ఆత్మీయ జీవితానికి మంచిదా కాదా అనేది చూసుకోవాలి. దేవుని కొరకు శోధనలలో నిలబడాలి. మీ ఆత్మీయ జీవితానికి స్టడీస్‌కి ఇబ్బందిగా ఉంటే ఆ ఫ్రెండ్‌షిప్‌ని కట్‌చేసుకోండి. మీకు కట్ చేసుకోవడం యోసేపు వలె చేత అవ్వడం లేదు, దేవుని దగ్గరకి తీసుకెళ్ళండి, ప్రభువా ఈ ఫ్రెండ్‌షిప్ వలన నా ఆత్మీయ జీవితం స్టడీస్‌కి డ్యామేజ్ జరుగుతుంది. కాబట్టి నాకీ ఫ్రెండ్‌షిప్ వద్దు అని ప్రేయర్ చేయండి ఆశ్చర్యకరంగా దేవుడు మిమ్మల్ని ఆ ఫ్రెండ్ సర్కిల్‌లోనుండి బయటికి తీసుకొస్తారు. నీతిమంతుడు సింహం వలె ధైర్యంగా ఉంటాడు. దుష్టుడు ఎవరూ తరుమకుండానే పారిపోతాడు. కాబట్టి మనం దేవుని కొరకు కదలని వారిగా స్థిరులుగా ఉండాలి.

దేవుని కొరకు నిలబడడానికి ఒక సమయాన్ని ఒక అవకాశాన్ని దేవుడు మనకు ఇస్తాడు. అప్పుడు మనం దేవుని కొరకు నిలబడి దేవునిని మహిమపరచాలి. మనం మారుమనస్సు పొందాలి. పరిశుద్ధ జీవితం నేర్చుకోవాలి, ప్రార్థనా జీవితం నేర్చుకోవాలి. అన్ని పరిస్థితులలో దేవుని కొరకు నిలబడడం నేర్చుకోవాలి. దేవుని కొరకు నిలబడినప్పుడు దేవుడు మనకు శక్తిని, బలాన్ని ఇస్తాడు. మనం పట్టుదల కలిగి ప్రభువు కొరకు నిలబడడానికి మనకు కృప దొరుకుతుంది. మీ ద్వారా గొప్ప పని జరుగుతుంది. అనేక ఆత్మలకు మీరు ఆశీర్వాదకరంగా ఉంటారు. మీరు దేవుని కొరకు పరిశుద్ధమైన జీవితం చేసే విధానం అన్యజనులు చూస్తారు. దేవుని యందు విశ్వాసముంచిన విధానం అన్యజనులు చూసి దేవునిని వారు కూడా వెంబడిస్తారు. ప్రభువు పక్షాన మనం నిలబడితే మన పక్షాన ప్రభువు నిలబడి కార్యాలు చేస్తారు. యోసేపుకి సహాయం చేసిన దేవుడు మనకు కూడా సహాయం చేస్తారు.

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2022-24

హోలి మినిస్ట్రీస్

# కన్వెన్షన్ – 2024

**ఏప్రియల్ 23 సా॥ నుండి 26 మ॥ వరకు**

**ప్రతిరోజు ఉ॥ 10-00 గం॥లకు మరియు సా॥ 6-30 ని॥లకు**

స్థలము : **బుడంపాడు, గుంటూరు**

To,
Sri / Smt.

If undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : +91 7893823893

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 4th & 5th of Every Month